సైనిక సంక్షేమ స్టిక్కర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: డిసెంబర్ ఏడో తేదీ త్రివిధ దళ జెండా ఆవిష్కరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైనిక సంక్షేమశాఖ బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా సైనిక సంక్షేమ నిధి స్టిక్కర్లను ఆవిష్కరించింది. సైనిక సంక్షేమం కోసం స్టిక్కర్లను కొనుగోలు చేయడంతో పాటు సైనిక సంక్షేమానికి ఆర్థికసాయం అందించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా సైనిక సంక్షేమాధికారి కేవి.రాఘవులు, అధికారులు వినాయకరెడ్డి, సాయిప్రకాష్, సురేంద్ర బాబు పాల్గొన్నారు.

సైనిక సంక్షేమ నిధి స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

తీరనున్న నీవా నది బాధితుల కష్టాలు

- కాంక్రీట్ గోడ నిర్మాణానికి సిఎం గ్రీన్ సిగ్నల్
- ఫలించిన ఎంఎల్‌ఏ గురజాల కృషి

నీవానదిని పరిశీలిస్తున్న ఎంఎల్‌ఏ గురజాల (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తుపాను హెచ్చరికలతో బిక్కు.. బిక్కు మంటూ నీవానది పొంగి ఇండ్లను ముంచేస్తుందేమో అంటూ జీవనం సాగించాల్సిందే... రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వీరి కష్టం తీరలేదు. గత 50 ఏండ్లుగా ఇదే పరిస్థితి. జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలో దాదాపు 7 కిలోమీటర్లపైగా ఇరువారం నుండీ కట్టమంచి వరకు నీవా నది ప్రవహిస్తోంది. నీవా నది పరిసరాల్లో రిక్షా, ఆటో, భవన నిర్మాణ, రజక ఇలా పేదలే అధికం. కైలాసపురం, వీరభద్రకాలనీ, రాజీవ్‌నగర్, తోటపాళ్యం ప్రాంతాల్లో పేదలు నివాసాలు ఏర్పాటు చేసుకొని కాపురం ఉంటున్నారు. ఎన్నడూలేని విధంగా రెండేళ్ళ క్రింత హుదూద్ తుపాను కారణంగా నీవానది ఉప్పొంగి 140 కుటుంబాలు సర్వం కొల్పోయాయి. దాదాపు 20 రోజులకు పైగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఉండాల్సి వచ్చింది. నీవానదిలో ఓ వ్యక్తి కొట్టుకుపోయారు కూడా అంతేకాకుండా ఇంట్లోని విలువైన సామాన్లు కొట్టుకుపోగా ఎలక్ట్రానిక్ వస్తువులు, టీవీ, ఫ్రిజ్ లాంటివి పాడైపోయాయి. నేటికి నీవానది పరివాహక ప్రాంతాల ప్రజలు నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటే బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.

పట్టుబట్టి సాధించి..

వరదల సమయంలో అష్టకష్టాలు పడే నీవానది పరిసర ప్రాంతవాసులు కష్టాలు తీరనున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నీవానది వ్యర్థలను తొలగించిన ఎంఎల్‌ఏ గురజాల జగన్‌మోహన్ పట్టుబట్టి అసెంబ్లీలో నీవానది పరిసర ప్రాంత వాసుల కష్టాలను అసెంబ్లీ దృష్టికి తీసుకుపోయారు. ఆరు కిలో మీటర్ల పొడవునా నీవానదికి ఇరువైపులా కాంక్రీట్ గోడ నిర్మాణానికి ఇరిగేషన్ శాఖ ద్వారా నిర్మాణ వ్యయంపై అంచనా వేయించారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల కృషి ఫలితంగా నీవానది పునర్జీవ చర్యలకు అడుగులు పడ్డాయి. నగర పరిధిలోని నీవానది పునరుజ్జీవ చర్యల్లో భాగంగా ఆక్రమణలు తొలగించి, వర్షాకాలంలో వరద నీటితో ముంపు సమస్య తలెత్తకుండా నది పొడవునా 6 కిలోమీటర్ల మేర సిమెంట్ కాంక్రీట్ వాల్ నిర్మించాలని కొరుకుతూ ఎమ్మెల్యే గురజాల అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జలవనరుల శాఖ మంత్రి, జలవనరుల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి వినతి పత్రాలు అందించి సమస్య తీవ్రతను వివరించారు. నగర పరిధిలో నది ఆక్రమణలకు గురి కావడం, నది అంచులు సక్రమంగా లేకపోవడం కారణంగా ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వరద నీరు నదికి ఇరువైపులా ఉన్న లోతట్టు ప్రాంతాలను ముంచెత్తి అపార ఆస్తి నష్టం జరుగుతోందని, ఈ సమయంలో ఈ ప్రాంతాల ప్రజలను తరలించడం, పునరావస చర్యలు కష్టతరంగా మారిందన్నారు. ఈ పరిస్థితుల్లో నదికి ఇరువైపులా పటిష్టమైన కాంక్రీట్ గోడ నిర్మాణం చేపట్టడం, మురుగునీరు వరదనీటిలో కలవకుండా చేయడం ద్వారా వరద నీటిని సాగునీటి అవసరాలకు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. కాంక్రీట్ వాల్ నిర్మాణం ద్వారా నదిని కాపాడుకోవడంతో పాటు స్థానిక ప్రజలు దశాబ్దాలుగా పడుతున్న ఇబ్బందులను శాశ్వతంగా తొలగించవచ్చని చెప్పారు. ఎమ్మెల్యే వినతిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి నీవానది పునర్జీవ చర్యల్లో భాగంగా సిమెంట్ కాంక్రీట్ వాల్ నిర్మాణానికి ప్రత్యేకశ్రద్ధ తీసుకొని అవసరమైన చర్యలు చేపట్టాలని జలవనరుల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.

చిత్తూరు వాసుల హర్షం..

అసెంబ్లీలో చిత్తూరువాసుల కష్టాలపై గళం విప్పి అడవిపల్లి రిజర్వార్ పెండింగ్ పైపులైన్ పూర్తికి నిధులు, నగర అభివృద్ధికి నిధుల మంజూరు, యూనివర్శిటీ ఏర్పాటుతో పాటు పేదల కష్టానికి తీర్చేలా నీవానదికి ఇరువైపుల కాంక్రీట్ గోడ నిర్మాణం రాష్ట్ర ముఖ్యమంత్రి నుండీ ఆమోదం తీసుకున్న చిత్తూరు ఎంఎల్‌ఏ గురజాల జగన్‌మోహన్ కృషిని ప్రజలు అభినందిస్తున్నారు. చిత్తూరు అభివృద్ధికి భీజాలు పడుతున్నాయని రానున్న రోజుల్లో చిత్తూరు నియోజవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా నీవానది పరిసర ప్రాంతాల్లోని పేదలు తమ దశాబ్దాల కళ నెరవేరనుందని ఆనదం వ్యక్తం చేస్తున్నారు.

హుదూద్ తుపాను సందర్భంగా నీట మునిగిన ఇండ్లు (ఫైల్‌ఫోటోలు)

సిపిఎం పోరాటం ఫలించింది

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

చిత్తూరు నడిబొడ్డున ఉన్న నీవానది పరివాహక ప్రాంతంలో వేలాదిమంది ప్రజల నివసిస్తున్నారు. గతంలో హుదూద్ తుపాన్ సందర్భంగా నీవానది ఉప్పొంగడంతో వేలాది మంది ప్రజల ఇండ్లల్లోకి నీళ్లు వచ్చి రోజులు తరబడి బయట ప్రాంతాల్లో ఉన్న పరిస్థితి. ఆ సమయంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రత్యక్షంగా ప్రజలు అండగా ఉంటూ అన్ని రకాల సహాయ సహకారాలు అందజేయడం జరిగింది. ఇళ్లల్లో అన్ని రకాల వస్తువులు నీట మునుగుడంతో రోజుల తరబడి వారికి భోజన వసతులు, వసతి సౌకర్యాలు కల్పించే విధంగా సిపిఎం ప్రత్యక్షంగా ఉండి పోరాటం చేసింది. ఆ సందర్భంగా దీర్ఘకాలికంగా సమస్య పరిష్కారం కోసం నీవానది రెండు వైపులా ప్రహరీ గోడ ఏర్పాటు చేసి ప్రజల ఇండ్లల్లోకి నీరు రాకుండా రక్షణ కల్పించే విధంగా అప్పటినుంచి డిమాండ్ చేయడం జరిగింది. ఆ డిమాండ్ ని గత ఎన్నికలలో రాజకీయ పార్టీలు అజెండాగా పెట్టే విధంగా సిపిఎం పోరాట ఫలితం. ప్రస్తుత చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ ఎన్నికల మేనిఫెస్టోలో ఈ డిమాండ్‌ను కూడా పెట్టడం జరిగింది. దాని ప్రకారం మొట్టమొదటిసారి ఎన్నికైన జగన్మోహన్ అసెంబ్లీలో ప్రస్తావించి ప్రజలకు అండగా నిలబడడాన్ని సిపిఎం అభినందిస్తున్నది. అలాగే ఇంకా అనేక రకాల సమస్యలు ఉన్నాయని వాటికోసం కూడా కృషి చేయాలని సిపిఎం కోరుతున్నది.

హోటళ్లు.. ఆరోగ్యానికి అనర్థాలు..

- ఇష్టానుసారంగా నిర్వాహణ
- పట్టించుకోని అధికారులు

ఆరోగ్యమే మహాభాగ్యం.. ఆరోగ్యానికన్నా మించిన ఆస్తి లేదు.. ఇలా ఎందరో మహానుభావులు ఆరోగ్యం గురించి నిత్యం వివరిస్తూనే ఉంటారు. కానీ అవసరానికి ఆహారం కోసం వెళ్లే హోటళ్ల ద్వారా చాలావరకు అనారోగ్య పాలవుతున్నామన్న విషయాన్ని మాత్రం గుర్తించలేకపోతున్నాం. గుర్తించినా పరిస్థితుల రిత్యా హోటల్స్‌కు వెళ్లక తప్పడం లేదు. దీనికి తోడు హోటళ్ల నిర్వహణను పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో కొన్ని హోటళ్ల యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

ప్రజాశక్తి- పూతలపట్టు: చిత్తూరు- నాయుడుపేట జాతీయ రహదారికి ఇరువైపులా లెక్క కట్టలేని హోటళ్లు వెలశాయి. ఒక్క చిత్తూరు నుంచి పూతలపట్టు మండల పరిధిలోని వేము కళాశాల వరకు రోడ్డుకి ఇరువైపులా సుమారు 42 ఇబ్బడి ముబ్బడిగా హోటల్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు వెలుస్తున్నాయి. ఇది కేవలం 17 కిలోమీటర్ల దూరం పరిధిలో ఉన్నవి మాత్రమే. తినుబండారాలు విభిన్న రుచుల మాంసాహారాల వంటకాల పేర్లతో నిర్వాహకులు ఆకర్షిస్తున్నారు. ఇదంతా ఒక కోణం కాగా కనిపించిన మరో కోణం ప్రజల ఆరోగ్యాలను గాలిలో దీపంలా మారుస్తున్నాయి. రసాయనాలతో కూడిన మసాలాలు క్యాన్సర్‌కు దారితీస్తోంది. రంగులు వాడిన నూనె వాడుతున్నారు. నాణ్యత పరిశుభ్రత ఉండటం లేదు ఏదైనా ఘటన జరిగితేనే ఈ డొల్లతనం బయటపడుతుండగా తనిఖీలు చేపట్టి కల్తీని అరికట్టాల్సిన అధికారులు కానరాకపోవడం ప్రజల ఆరోగ్యానికి శాపంగా మారింది. ఈ సమస్యపై ఎవరికి ఫిర్యాదు చేయాలో కూడా తెలియని పరిస్థితి.

మహారాష్ట్రకు చెందిన కొందరు పూతలపట్టు సమీపంలోని ఒక కర్మాగారంలో పనిచేస్తున్నారు. వీరిలో ముగ్గురు యువకులు కలిసి రోడ్డు పక్కన ఉన్న ఒక హోటల్లో భోజనం పార్సల్ తెచ్చుకున్నారు. తినడానికి పార్సిల్ విప్పగా అందులో తెల్లని పురుగులు కనిపించాయి. గత పది రోజులుగా ఈ హోటల్ నుంచే భోజనం తెప్పించుకుని తింటున్నాం. ఇలాంటి భోజనాన్ని తింటున్నందువలన మా పరిస్థితి ఏమిటని భయాందోళన చెందుతున్నారు. ఇలా అనేక ఉదాహరణలు నిత్యం వినిపిస్తూనే ఉన్నాయి.

కనిపించని పర్యవేక్షణ

హోటల్లో నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లోపించడంతో హోటళ్ల యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కనీస అనుమతులు లేకుండా ఎక్కడపడితే అక్కడ హోటల్లు వెలుస్తున్నాయి. కొన్ని హోటళ్లలో పరిశుభ్రత పాటించడం లేదు. రెండు రోజుల క్రితం మిగిలిన మాంసాహారాలను వేడి చేసి వడ్డించేస్తున్నారు. గుర్తించిన పలువురు ఇదేమని ప్రశ్నిస్తే హోటల్ యజమానులు తిరిగి దాడికి యత్నిస్తున్నారు. దురాభారం నుంచి హోటల్‌కు వచ్చిన చాలామంది ఎదురుగు తిరగలేక భోజనాలను తినలేక.. బిల్లు కట్టేసి వెళ్ళిపోతున్నారు.

నిబంధనలు.. ఇలా..

ఫుడ్ సేఫ్టీ చట్టం 2012 ప్రకారం ఆహారంలో హానికరమైన రంగులు వాడకూడదు. నూనెను విడిగా విక్రయించినది వాడకూడదు. పట్టణ ప్రాంతాల్లో ప్రతి 50,000 మందికి గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి లక్ష మందికి ఒక తనిఖీ అధికారి ఉండాలి. ప్రతి అధికారి తాను పనిచేసే పరిధిలో నెలకు 12 చోట్ల తనిఖీలు చేపట్టాలి. అయితే అది పూర్తిస్థాయిలో జరగడం లేదు ఆహారత్తానికి అధికారుల కొరత ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

29న ప్రజా దర్బార్

ప్రజాశక్తి- కుప్పం టౌన్: గుడిపల్లి మండలం సోడిగానిపల్లి గ్రామంలో ఈనెల 29వ తేదీ శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కడా పిడి వికాస్ మరమత్ తెలిపారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను తెలుసుకొని, వాటిని పరిష్కరించడంతోపాటు గ్రామాలలో క్షేత్రస్థాయి పరిశీలన చేసి, గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున శుక్రవారం జరగబోవు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకుని, వారి సమస్యలను, గ్రామ అవసరాలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

కడా పిడి వికాస్ మరమత్

అన్న క్యాంటీన్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: అన్న క్యాంటీన్ కోసం స్థలాన్ని పరిశీలించినట్టు తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో గల రెండు ప్రాంతాల్లో స్థలాన్ని పరిశీలించారు. గత సోమవారం అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు మండల ప్రజలు విన్నవించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థలాన్ని పరిశీలించి నివేదికలు తయారుచేసి కలెక్టర్‌కు పంపనున్నట్లు తహశీల్దార్ తెలిపారు.

పీజీ విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: పీజీ విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ద్రావిడ విశ్వవిద్యాలయ కులసచివులు ఆచార్య కిరణ్ కుమార్ బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. పీజీ చదవడానికి ప్రవేశ పరీక్ష ఉత్తీర్ణత సాధించని వారు, పరీక్ష రాయని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన వారు ఈనెల 27 నుండి 29 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్సైట్ను సంప్రదించాలని సూచించారు.

కందూరు విద్యార్థులకు ఛాంపియన్‌షిప్

ప్రజాశక్తి- సోమల: నవంబర్ 27వ తేదీన పొద్దుటూరులో నిర్వహించిన ఇంటర్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో కందూరు చెందిన మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచి ఛాంపియన్ షిప్ కైవసం చేసుకున్నారు. కరాటే కటాఫ్ పోటీలలో కందూరు చెందిన ప్రదీప్, ఉదయ్, భవ్యశ్రీ, హితేష్, యాసీన్, అదీల్, సుహాష్ పరిజిన్లు విజేతలుగా నిలిచి బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. ప్రొద్దుటూరు విశ్రాంత జెడికె కుంగ్ ఫూ వ్యవస్థాపకుడు దామోదర్ మాస్టర్, సివిల్ జడ్జి ఇస్మాయిల్ మాస్టర్ చేతులు మీదుగా చాంపియన్షిప్ ట్రోఫీలు, బంగారు పతకాలు అందుకున్నారు. కరాటే పోటీలలో ఛాంపియన్షిప్ సాధించిన విద్యార్థులు కందూరులోని సాయి చరణ్ భారతి విద్యామందిర్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ అప్షాద్, విద్యార్థులను కందూరు సర్పంచ్ భాషా మసూద్ అభినందించారు.

నియోజకవర్గ సమస్యలపై చర్చ

- కలెక్టర్‌ను కలిసిన పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్
- యాదమరి- గుడియాత్తం రోడ్డు పనులు ప్రారంభం

కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

ప్రజాశక్తి- యాదమరి: పూతలపట్టు నియోజకవర్గం అభివృద్ధిపై చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌తో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ బుధవారం సమావేశమయ్యారు. చిత్తూరు జిల్లా సచివాలయంలో గల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సుమిత్ కుమార్ ను పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ నియోజకవర్గంలోని వివిధ సమస్యలపై విస్తృతంగా చర్చించారు. రైతుల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని, ఆ సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు చేపట్టాలని కోరారు. నీటి సమస్యలు, సాగు సంబంధిత సదుపాయాలు వంటి అంశాలను చర్చించారు. యాదమరి– గుడియాత్తం రోడ్డు పనుల పురోగతిని తక్షణమే మొదలు పెట్టేలా చొరవ చూపాలని, ఈ రోడ్డు మరమ్మతులు పూర్తయితే స్థానిక ప్రజలకు రవాణా సౌలభ్యం కలుగుతుందని, వాణిజ్యపరంగా కూడా అభివృద్ధికి దోహదం అవుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ మేరకు కలెక్టర్ సమాధానం ఇస్తూ, మొదటి దశలో పనులు డిసెంబర్ నెల 4,5 తేదీల్లో ప్రారంభం అవుతాయని హామీ ఇచ్చారు. అలాగే మామిడి పంటను పెంచడం, రైతులకు మార్కెటింగ్ సదుపాయాలు అందించేందుకు ప్రత్యేక మామిడి బోర్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించడంతో ఈ ప్రతిపాదనకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అలాగే ఉపాధి హామీ పథకాల కింద స్కిల్డ్ లేబర్స్‌ను ప్రోత్సహిస్తూ పనులను కేటాయించాల్సిన అవసరం ఉందని, దీని ద్వారా వలసలు పోయే కూలీలు సంఖ్య తగ్గే అవకాశం ఉందని, ఉపాధి హామీ పథకంలో స్థానిక యువతకు ఉపాధి కల్పించడంతో పాటు ప్రజా ప్రయోజనాలను పెంచుతుందని ఎమ్మెల్యే తెలిపారు. పూతలపట్టు, ఐరాల, యాదమరి మండలాల అధ్యక్షులు దొరబాబు చౌదరి, గిరిధర్ బాబు, మురార్జీ యాదవ్, ఉపాధ్యక్షులు సుభాష్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, రబ్బీ, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు గంగారపు హరిబాబు నాయుడు, మోహన్ నాయుడు, అడ్వకేట్ జ్యోతి రామ్ పాల్గొన్నారు.

మరణించిన వారి ఓట్లు తొలగించండి..

అబ్జర్వ్‌కి సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు వినతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలో నూతనంగా ఇచ్చిన ఓటర్ లిస్ట్‌లో దాదాపు 20వేల మంది చనిపోయిన వారు ఉన్నారని వాటిని శాస్త్రీయ పద్ధతుల్లో తొలగించాలని బుధవారం తిరుపతి కలెక్టరేట్లో మూడు జిల్లాల రాజకీయ పార్టీలు, అధికారులతో అబ్జర్వ్ వినయ్ చందు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ ఓటర్ లిస్ట్‌లో చనిపోయిన వారు భారీగా ఉన్నారని వాటిని తొలగించడానికి గతంలో నుంచి అనేకసార్లు ఫిర్యాదు చేసిన అవి సాధ్యం కాదని అధికారులు చెప్తున్నారని, ఎన్నికల కమిషన్ దగ్గర ప్రత్యేక పర్మిషన్ తీసుకొని మున్సిపాలిటీ కార్పొరేషన్‌లో చనిపోయిన వారి లిస్టును తీసుకొని అలాగే రూరల్‌లో సచివాలయం దగ్గర ఉన్న చనిపోయిన వారి లిస్ట్ తీసుకొని శాస్త్రీయంగా ఓటర్ లిస్టులో తొలగిస్తే ఓటర్ లిస్ట్ పరిపూర్ణంగా ఉంటుందని కోరుతూ వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా అబ్జర్వ్ వినయ్ చందు మాట్లాడుతూ మీరు చెప్పిన సమస్య చాలా న్యాయమైనదని, కచ్చితంగా వాటిని తొలగిస్తామని తెలిపారని పేర్కొన్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు, నెల్లూరు జిల్లా అధికారులు ఇతర రాజకీయ పార్టీల నాయకులు అధికారులు పాల్గొన్నారు.

వినతి పత్రం అందిస్తున్న సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

అపరిశుభ్రంగా ప్రభుత్వ బడులు

ప్రజాశక్తి- చిత్తూరు టౌన్

చిత్తూరు నగరంలోని ప్రభుత్వ పాఠశాలలు అపరిశుభ్రతకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. పాఠశాలలో పరిసరాలు గడ్డి, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయి దోమలకు, పాములకు, విష పురుగులకు నిలయాలుగా మారిపోయాయి. పాఠశాలల చుట్టుపక్కల కాలువల్లో మురుగునీరు వెళ్లకుండా నీరు నిలువ ఉండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. మరికొన్ని పాఠశాలల ఎదురుగానే పేడ దిబ్బలు ఉండడంతో నిర్గంధం వస్తోంది. వాటి నుంచి వచ్చే పురుగులు దోమలు, విషపురుగుల వలన పిల్లలు అనారోగ్యాల పాలవుతున్నారు. పాఠశాలలో అపరిశుభ్రంగా ఉండడంతో చుట్టుపక్కల ఏపుగా పిచ్చి మొక్కలు పెరగడంతో స్థానికులు అక్కడే మలమూత్ర విసర్జనకు వెళ్లడంతో పాఠశాలలో మరింత అధ్వానంగా తయారయ్యాయి. సరస్వతి నిలయాలు అనారోగ్య నిలయాలుగా మారిపోతున్నాయి. సరైన మంచినీరు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు విద్యార్థులు. దీంతో పాఠశాల ప్రాంగణంలో పెరిగిన పిచ్చి మొక్కలను స్థానికులే శుభ్రపరచుకునే పరిస్థితి దాపరించింది. కార్పొరేషన్ సిబ్బందికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని తమ పిల్లలు రోగాల బారిన పడకూడదని తామే పాఠశాల శుభ్రం చేస్తున్నామని స్థానికుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని కొన్ని పాఠశాలల్లో ప్రవేశించగానే మందు బాటిల్లు నిషేధిత మాదకద్రవ్యాల ప్యాకెట్లు స్వాగతం పలుకుతూ కనిపిస్తున్నాయి. స్కూల్ ముగిసిన తర్వాత మందుబాబులు ఆకతాయిలో పాఠశాలల్లో ప్రవేశించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. వీరి వలన ఇటు స్థానికులు, అటు పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పై సమస్యలను సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించాలని స్థానికులు విద్యార్థులు కోరుతున్నారు.

పిచ్చిమొక్కలను తొలగిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

విభిన్న ప్రతిభావంతులకు క్రీడాపోటీలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకల సందర్భంగా చిత్తూరు, తిరుపతి జిల్లా లోని విభిన్న ప్రతిభావంతులకు ఈనెల 29, 30 తేదీలో తిరుపతి పట్టణంలోని శ్రీవెంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు సహాయ సంచాలకులు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలలోని ఆసక్తి కలిగిన విభిన్న ప్రతిభావంతులు, వారి సంక్షేమం కొరకు పని చేస్తున్న సంఘాలు, స్వచ్ఛంధ సంస్థలు పాల్గొని క్రీడాపోటీలను జయప్రదం చేయాలని కోరారు.

29న అంతర్జాతీయ బృందం రాక

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతు సాధికార సంస్థ ద్వారా అమలుచేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించేందుకు అంతర్జాతీయ ప్రతినిధి బృందం ఈ నెల 29 వ తేదీ శుక్రవారం చిత్తూరు జిల్లాలోని కుప్పం నియోజకవర్గంలో పర్యటించనుంది. ప్రపంచ వ్యాప్తంగా ఆగ్రోఎకాలజీలో జరుగుతున్న నూతన పరిజ్ఞానాన్ని పరిశీలించే క్రమంలో భాగంగా పర్యటిస్తున్న ఈ బృందంలో 20 దేశాలకు చెందిన 27 మంది ప్రతినిధులతో పాటు 9 మంది భారతీయ ప్రతినిధులు కూడా ఉంటారు. ఆగ్రో ఎకాలజీ అభ్యాసకులు, పరిశోధకులు, రైతు ప్రతినిధులు, వ్యవసాయ నిపుణులు ఈ పర్యటనలో పాల్గొంటారు. ఈ బృందం కుప్పం నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లోని ప్రకృతి వ్యవసాయ మోడళ్లను, పొలాలను సందర్శించి ప్రకృతి వ్యవసాయ కార్యక్రమ అమలు విధానం గురించి తెలుసుకొంటారు. రైతులతో ముచ్చటించి వారి అనుభవాలను తెలుసుకొని రాష్ట్రంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను రసాయన ఆధారిత వ్యవసాయ పద్ధతులతో పోల్చుతూ ప్రకృతి వ్యవసాయంలో దాగి ఉన్న విజ్ఞానాన్ని అర్థం చేసుకొంటారని రైతు సాధికార సంస్థ ముఖ్య కార్య నిర్వహణాధికారి బి.రామా రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

వర్చువల్‌గా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం పట్టణం మండల అభివృద్ధి కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ అశ్విని ఆధ్వర్యంలో ఎంపీడీవో సాయిలహరి మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నంలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు ఎంపీడీవో కార్యాలయంలో వర్చువల్‌గా ఇంటరాక్టివ్ ఏరియాను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలో మొట్టమొదటిసారిగా వర్చువల్ సమావేశాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కుప్పం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా మండల సర్వసభ్య సమావేశంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంపై ఎంపీపీ తోపాటు ఎంపీడీవోను అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రొఫెషనల్ వింగ్ ఉపాధ్యక్షులు డాక్టర్ వెంకటేష్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు, సభ్యులు కన్నన్, బాబు, నాయకులు ఆర్ ఆర్ రవి, తెలుగు యువత సుబ్బు పాల్గొన్నారు.

వర్చువల్ ఇంటరాక్టివ్ ఏరియాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

సచివాలయం, ఆర్‌బికెలకు తాళం

పడిగాపులు పడుతున్న ప్రజలు

సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యార్థుల అవస్థలు



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం, ధర్మపురి పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాల్లోని అధికారులు, సిబ్బంది మధ్యాహ్నం 12 గంటలైనా కార్యాలయాలకు తాళం తెరువకపోవడంతో ప్రజలు అక్కడే పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. బుధవారం విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్స్ కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సచివాలయం ఎదుట గంటల తరబడి ఎండలోనే ఎదురుచూడాల్సి వచ్చింది. అలాగే రైతు సేవా కేంద్రాలకు సైతం తాళం వేసి ఉండటంతో ఎరువులు, ఇతర దరఖాస్తుల కోసం వచ్చిన రైతులు సైతం ఎదురుచూస్తూనే ఉండాల్సిన పరిస్థితి. అధికారుల నిర్లక్ష్యం వలన ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సిబ్బంది, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యువతే నవ సమాజ నిర్మాతలు : సీఐ

ప్రజాశక్తి- కుప్పం టౌన్: యువతే నవసమాజ నిర్మాతలని ఎల్లప్పుడు మంచి వైపు ఉంటూ, ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎదగాలని సీఐ మల్లేష్ యాదవ్ తెలిపారు. బుధవారం కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ వి.నారాయణమూర్తి సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, కొంతమంది అక్రమ సంపాదనకు పాల్పడుతూ సైబర్ నేరాలకు దిగుతున్నారని తెలిపారు. ఇందులో భాగంగా వాట్సప్ ద్వారా లింకులను పంపుతూ అమాయక ప్రజలను ఆకట్టుకుంటున్నారని, వాటికి ఆకర్షితులైన వారి సెల్ఫోనులను హ్యాక్ చేసి, వారి బ్యాంకు ఖాతాల నుండి సొమ్ము కాజేస్తున్నట్టు తెలిపారు. నేటి యువత సామాజిక మాధ్యమాలపై పూర్తి అవగాహన కలిగి ఉన్నారని, అలాంటి యువత సాంకేతికతను పెంచుకొని అమాయక ప్రజలకు అవగాహన కల్పిస్తూ, సైబర్ నేరాలను అడ్డుకోవడానికి పోలీసులకు తోడ్పడాలని సూచించారు. వైస్ ప్రిన్సిపల్ ప్రదీప్ కుమార్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

186 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: రాష్ట్ర బాలసురక్ష కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు వరం లాంటిదని డాక్టర్ దుర్గాదేవి తెలిపారు. గంగాధర నెల్లూరు జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. రాష్ట్రీయ బాల సురక్ష ప్రోగ్రాం భాగంగా బుధవారం 186 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దుర్గాదేవి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యం ముఖ్యమని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త ఉండాలని విద్యార్థులు తెలిపారు. సిహెచ్‌ఓ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీలు సంధ్య, ఝాన్సీ, ఏఎన్ఎంలు భారతి, మమత, ఆశ వర్కర్ జ్యోతి పాల్గొన్నారు.

రైతు సంఘాలను బలోపేతం చేయండి

ప్రజాశక్తి -సదుం: మండల పరిధిలోని రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘాలు (ఎఫ్‌పిఓ)లను బలోపేతం చేయాలని జిల్లా ఉద్యాన అధికారి డి.మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలో ఎంఐడిహెచ్ సహకారంతో ఏపీ మాస్ ఎన్‌జిఓ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘాల సభ్యులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎంఐపి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యాన అధికారి డి. మధుసూదన్ రెడ్డి సమావేశం నిర్వహించారు. బూరగమంద, చెరుకువారి పల్లి, గొంగివారిపల్లి, పాలమంద గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతు సంఘాలను బలోపేతం చేయాలని, రైతు సంఘాల ద్వారా ఎరువులు, మందులు, విత్తనాలు సబ్సిడీ ధరలకు తీసుకోవచ్చు అని తెఇలపారు. సదుంలో ఇప్పటికే సుమారుగా 340 మంది రైతు సంఘాల సభ్యులు ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచులు వెంకటరమణ, నారాయణరెడ్డి, ఐశ్వర్య, ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రమణ్యం, ఏపీ మాస్ మేనేజర్ టి.రమేష్ రెడ్డి, ఎంఐఏఓ టి.గాయత్రి, ఏపీ మాస్ కోఆర్డినేటర్ నాగేంద్ర, మండల పరిధిలోని రైతు సేవా కేంద్రాలు అధికారులు స్వర్ణలత, లలిత, సతీష్ కుమార్, తేజోవతి, రైతు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

విజయబాబుకు సన్మానం



ప్రజాశక్తి - ఎస్ఆర్‌పురం: మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ బసివిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన విజయబాబు జాతీయ కాపు సంఘ చిత్తూరు జిల్లా పార్లమెంటరీ అధ్యక్షుడుగా నియమితులైనందున విజయబాబును కొత్తపల్లి గ్రామానికి చెందిన యువత ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా ఆయనను శాలువ కప్పి పుష్పగుచ్చం అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురునాథం, దాసరి సతీష్, జీవన్ కుమార్, మోహన్ కుమార్, సతీష్ పాల్గొన్నారు.

సంచార జాతుల సంఘం

జిల్లా అధ్యక్షులుగా శివ తేవర్

ప్రజాశక్తి- కుప్పం టౌన్: సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూసల రవి బుధవారం కుప్పం పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ విప్‌గా ఎన్నికైన ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్‌ను కలిసి ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. అనంతరం ఎంబిసి కులాల సంఘం నియామకాలను చేపట్టారు. ఇందులో భాగంగా కుప్పం పట్టణానికి చెందిన శివ తేవర్‌ను చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులుగా, శాంతిపురం మండలానికి చెందిన కృష్ణమూర్తిని చిత్తూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షులుగా, కుప్పం కొత్తపేటకు చెందిన మురళిని ఉప నియోజకవర్గ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. అనంతరం నూతన నాయకులు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో అత్యంత వెనుకబడిన కులాల అభ్యున్నతికి పనిచేస్తామని, ముఖ్యంగా ప్రభుత్వ పథకాల పై వెనుకబడిన కులాలకు అవగాహన కల్పిస్తూ, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా పనిచేస్తామని తెలిపారు. జోగి రమేష్ పాల్గొన్నారు.

వన్నెకుల క్షత్రియులకు అండగా ఉంటాను

రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ అధ్యక్షులు సిఆర్ రాజన్

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం నియోజకవర్గంలోని వన్నెకుల క్షత్రియులకు అండగా ఉంటానని రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ అధ్యక్షులు సిఆర్.రాజన్ తెలిపారు. బుధవారం ఆయన కుప్పం పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వన్నెకుల క్షత్రియ సంఘం అధ్యక్షులు రుద్రప్ప ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, టిటిడి పాలకవర్గ సభ్యులు శాంతారామ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు, సీఎం పీఏ మనోహర్ సిఆర్ రాజన్‌ను ఘనంగా సన్మానించారు. టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు కాణిపాకం వెంకటేష్, మాజీ ఎంపీపీ సాంబశివం, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, సతీష్, ఈశ్వర్ పాల్గొన్నారు.

ఎస్ఐగా నాగేశ్వర్ రావు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి- చౌడేపల్లి: అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామని చౌడేపల్లె నూతన ఎస్ఐ నాగేశ్వర్ రావు తెలిపారు. చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఉత్తర్వుల మేరకు బుధవారం ఉదయం చౌడేపల్లె పోలీస్ స్టేషన్లో నూతన ఎస్ఐగా నాగేశ్వర్ రావు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ ప్రతాప్ రెడ్డి మూడు నెలల క్రితం ఎస్ఐల సాధారణ బదిలీల్లో భాగంగా కడప జిల్లా కమలాపురం వెళ్లారు. దీంతో చౌడేపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ పోస్టు మూడు నెలలుగా ఖాళీగా ఉండేది. ఈ క్రమంలో అన్నమయ్య జిల్లా, రాజంపేటలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ నాగేశ్వర్‌రావు చౌడేపల్లెకి బదిలీపై వచ్చారు. ఎస్సై మాట్లాడుతూ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటామని ఏదైనా సమస్యలుంటే నేరుగా తనను సంప్రదించి వచ్చు అని తెలిపారు.

ఐటిఐ విద్యార్థులకు నైపుణ్యతపై శిక్షణ

ప్రజాశక్తి- విజయపురం: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ విద్యార్థులకు నైపుణ్యత అంశాలపై రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డి.వెంకమ రాజు బుధవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు విద్యతోపాటు వివిధ అంశాల పట్ల నైపుణ్యత కలిగి ఉండాలని తెలిపారు. పారిశ్రామిక రంగంలో నైపుణ్యత కలిగిన వారికి ఉద్యోగ అవకాశాలు అధికంగా ఉన్నాయని దీనిని విద్యార్థులు గమనించాలన్నారు. మారుతున్న కాలానికి కనుగుణంగా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకొని వివిధ రంగాలలో రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ లలిత కుమారి పాల్గొన్నారు.

వృద్ధురాలిపై వీధి కుక్కలు దాడి

ప్రజాశక్తి- పుంగనూరు: ఓ వృద్ధురాలిపై వీధి కుక్కల గుంపు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన బుధవారం పుంగనూరులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని కుమ్మరినత్తం పంచాయతీ పిచ్చి గుండ్లపల్లి గ్రామానికి చెందిన చిన్న రామయ్య భార్య జయమ్మ(65) పంచాయతీ సచివాలయం ఉన్న మిట్టపల్లెకు వెళ్ళింది. ఆమెకు అవసరమైన మాత్రలు తిరిగి వస్తుండగా అక్కడ గుంపుగా ఉన్న కుక్కలన్ని కలిసి ఆమెపై దాడి చేసి తీవ్రగాయాలు చేశాయి. స్థానికులు కుక్కలను తరిమేసి వెంటనే ఆమెను పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి చికిత్స అందించారు. వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం మండల పెద్దబంగారునత్తం గ్రామంలో బుధవారం సీసీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్.మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు భూమిపూజ నిర్వహించి రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని ప్రకారం కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్టు తెలిపారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా టిడిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింప చేస్తోందన్నారు. రాష్ట్ర టిడిపి ప్రొఫెషనల్ వింగ్ ఉపాధ్యక్షులు డాక్టర్ వెంకటేష్, టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, సతీష్, రామచంద్ర పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా శరత్

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం నియోజకవర్గ పరిధిలోని గుడుపల్లి, కుప్పం మండలాలకు చెందిన ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సమావేశాన్ని కుప్పం పట్టణంలోని సుజ్ఞానానంద ఆశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అసోసియేషన్ నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని, అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా శరత్‌ను ఎన్నుకోవడం జరిగిందన్నారు. అనంతరం నూతన నాయకత్వం మాట్లాడుతూ ముందుగా తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్న అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఫోటోగ్రాఫర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటిని పరిష్కరించడానికి ముందుండి పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండు మండలాలకు చెందిన ఫోటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ పాల్గొన్నారు.

ఆర్‌టిఐతో సమాచారం లభ్యం

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: ఆర్‌టిఐ చట్టం అమల్లోకి రావడం వల్లే ప్రభుత్వ కార్యాలయాల్లో ఏవిధమైన వివరాలైనా సులభంగా లభ్యమవుతోందని మండల పరిషత్ సూపరింటెండెంట్ లోకేష్, రెండవ ఎంఈఓ గుణశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆర్‌టిఐ యూనియన్ ఏర్పాటు చేసి నాలుగు సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఆర్‌టిఐ యూనియన్ నాయకులు, అధికారులు కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆర్‌టిఐ జాతీయ యూనియన్ అధ్యక్షులు బండి పట్టాభిరెడ్డి మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో సమాచార చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావడమే యూనియన్ ప్రధాన ఉద్దేశమన్నారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ డికె.కుమార్, జాతీయ ఆర్‌టిఐ ఉపాధ్యక్షుడు మోహన్ కుమార్, విద్యుత్ ఏఈ వరదరాజులు, పోలీస్ కానిస్టేబుల్ శరత్, యూనియన్ సభ్యులు రాజేష్ కుమార్, రామ్ రాజ్ పాల్గొన్నారు.

ప్రపంచ సాహితీ సదస్సులో ద్రావిడ విశ్వవిద్యాలయ అధ్యాపకులు

ప్రజాశక్తి- గుడిపల్లి: ఖతార్ దేశపు రాజధాని దోహా నగరంలో నవంబరు 22వ తేదీ నుండి 24వ తేదీ వరకు జరిగిన 9వ తెలుగు ప్రపంచ సాహితీ సదస్సులో ద్రావిడ విశ్వవిద్యాలయం నుండి తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ వేలం పళని, ప్రచురణల విభాగం పూర్వ అధ్యక్షులు డాక్టర్ డి.ఉదయ కుమారి పాల్గొన్నట్టు విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. ప్రపంచ సాహితీ సదస్సులో విశ్వవిద్యాలయ అధ్యాపకులు వేమన అనుసరించిన అచల యోగంపై ప్రసంగిస్తూ అచల యోగులు శంకరుని అద్వైతాన్ని, రామానుజుల విశిష్ట అద్వైతాన్ని, మధ్వాచార్యుల ద్వైతాన్ని ఖండించారని, బుద్ధుడు ప్రవచించిన సమాధి స్థితి కంటే అచల స్థితి మరింత ఉత్తమమైనదని వివరించినట్టు తెలిపారు. సమాధి స్థితిలో కూడా ఆత్మ అస్తిత్వాన్ని కలిగి ఉంటుందని అచల స్థితి ఆత్మను కూడా లయం చేసే ఓంకార రహిత స్థితి అని, ఇటువంటి గాఢమైన తత్వాన్ని కూడా వేమన సులభమైన తెలుగు పదాలతో తెలుగువారికి అందించారని వేమన గొప్పతనాన్ని వివరించడం జరిగిందన్నారు. భాషా శాస్త్రంలో ఆంగ్లం నుండి తెలుగులోకి తెచ్చుకోవాల్సిన నూతన పరికల్పిత పదాలను గురించి ఉపన్యసిస్తూ పారిభాషిక పదాలన్నీ పరికల్పిత పదాలు కావని, పరికల్పిత పదాలు కూడా కొన్ని సంవత్సరాలు ప్రజాబాహుళ్యంలో నలిగిన తర్వాత సాధారణ పదాలుగా మారుతాయని వివరించినట్టు తెలిపారు. భాషా శాస్త్రంలో ఉన్న అనేక ఆంగ్ల పదాలను తెలుగులోకి తెచ్చుకోవడానికి అవసరమైన చర్యల గురించి సవివరంగా వివరించడం జరిగిందన్నారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ఆంధ్ర కళావేదిక ఖతార్ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సుకు భారత మాజీ ఉపరాష్ట్రపతి పద్మ విభూషణ్ వెంకయ్య నాయుడు, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, కవి వక్త జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు, సినీ డైరెక్టర్ వైవిఎస్ చౌదరి మొదలైన ప్రముఖులు అతిథులుగా పాల్గొన్నారు అని తెలిపారు.



ప్రపంచ సాహితీ సదస్సులో ప్రసంగిస్తున్న ద్రావిడ విశ్వావిద్యాలయ అధ్యాపకులు

అవకాశాలను అందిపుచ్చుకోవాలి : ఎమ్మెల్యే

కార్యక్రమంలో మాట్లాడుతున్న శాసనసభ్యులు అమర్నాథరెడ్డి

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని మదర్ థెరిస్సా విద్యాసంస్థలలో గురువారం విద్యార్థులకు జరిగిన ప్లేస్‌మెంట్‌ను పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమరనాథ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు సింగిల్ విండో విధానంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, విధానాలను ఆయన తెలియజేశారు. భవిష్యత్తులో పలమనేరు ప్రాంతంలో విరివిగా పరిశ్రమలు వచ్చేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని, విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకుని వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. అదేవిధంగా ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకొచ్చేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు, కళాశాల ఛైర్మన్ సునీల్ కుమార్, అకడమిక్ అడ్వైజర్ రాజేంద్ర రెడ్డి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భరోసా ఇచ్చేందుకే సభ్యత్వ నమోదు: చల్లా రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి- సోమల: తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు నమ్మకాన్ని భరోసాన్ని ఇచ్చేందుకే సభ్యత్వ నమోదు చేయిస్తున్నామని, వారికి ఆ నమ్మకాన్ని కలిగించే విధంగా ప్రతి తెలుగుదేశం పార్టీ నాయకులు పల్లెపల్లెల్లో తిరిగి సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రమైన సోమలలోని మార్కెట్ యార్డ్‌లో మండలస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మండలంలో ఇప్పటికే 6 వేల పైచిలుకు సభ్యత్వ నమోదు జరిగిందని దీన్ని మరింతగా పెంచేందుకు కార్యకర్తలు, నాయకులు సైనికుల పనిచేసే పూర్తి చేయాలన్నారు. మండల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, నాయకులు పిఎం మల్లికార్జున, హరి ప్రసాద్, శ్రీనివాసులు నాయుడు, బాలసుబ్రహ్మణ్యం నాయుడు, ఉమాపతి నాయుడు, సతీష్, భాను పాల్గొన్నారు.

ఎవరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదు: చల్లా బాబు

పుంగనూరు : నాయకులు, కార్యకర్తలు ఎవరు నిరాశ చెందవలసిన అవసరం లేదని అందరికీ అన్ని రకాల ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని టిడిపి పుంగనూరు నియోజకవర్గ ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక పంచాయతీరాజ్ అతిథిగృహ ఆవరణంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇప్పటికి వరకు పుంగనూరు నియోజకవర్గంలో 36 వేల సభ్యులకు సభ్యత్వ నమోదు చేపట్టినట్లు చెప్పారు. పట్టణ ఫైవ్‌మాన్ కమిటీ సభ్యులు సివి.రెడ్డి, దేశాధి ప్రకాష్, శ్రీకాంత్, రామకృష్ణం రాజు, సయ్యద్ షెల్ బాషా, టిడిపి రూరల్ అధ్యక్షుడు మాధవరెడ్డి, కృష్ణ నాయక్, సుబ్రమణ్యం రాజు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు

వెదురుకుప్పం: మండలంలోని అగ్గిచేనుపల్లి పంచాయతీలో బుధవారం టిడిపి మండల అధ్యక్షులు కే.లోకనాథరెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. టిడిపి జిల్లా మాజీ కార్యదర్శి మండల క్లస్టర్ ఇంచార్జీ మోహన్ మురళి, సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం రెడ్డి, బూత్ కమిటీ కన్వీనర్ బుచ్చిబాబు, బాబురెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు వరప్రసాద్ పాల్గొన్నారు.

జోనల్ స్థాయి పోటీలలో విద్యార్థుల ప్రతిభ

ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: జోనల్ స్థాయి పోటీలో విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం విద్యార్థుల అభినందనసభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా వజ్రోత్సవ ఉత్సవాలలో భాగంగా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు కడప నగరంలో జోనల్ స్థాయిలో ఏర్పాటుచేసిన పోటీలలో మంగళపల్లి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచార తెలిపారు. ఈ పోటీల్లో చిత్తూరు జిల్లాకు నాలుగు ప్రథమ బహుమతులు, ఒక ద్వితీయ బహుమతి రాగా అందులో రెండు ప్రథమ బహుమతులు మంగళపల్లి విద్యార్థులవే అన్నారు. గణిత ఉపాధ్యాయుడు, అవధాని అరుణ శివప్రసాద్ మార్గదర్శకత్వంలో పదవ తరగతి విద్యార్థినులు ఏపి.హేమ (డిబేట్), యస్.హిమశ్రీ (వ్యాసరచన)లు జిల్లా స్థాయిలో గెలుపొందారు. కడప జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి చేతుల మీదుగా విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. హిమశ్రీ, హేమ వారివారి విభాగాలలో ఎనిమిది జిల్లాల నుండి పాల్గొన్న వారిలో ప్రథమ బహుమతి సాధించి పాఠశాలకు మరియు చిత్తూరు జిల్లాకు గొప్ప పేరుని తీసుకువచ్చారని, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

104 వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి- యాదమరి: 104 వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని యాదమరి వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొట్టాల గ్రామంలో 104 వైద్యసేవల్లో పాల్గొన్న డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ ప్రజలనుదేశించి మాట్లాడారు. ప్రతినెలా నాలుగవ బుధవారం మీ గ్రామానికి 104 సంచార వైద్య వాహనంతో పాటు వైద్య సిబ్బంది కూడా హాజరవుతారని, చిన్నచిన్న జబ్బులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు సైతం అందిస్తామని, ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఎలాంటి ఖర్చులు లేకుండా వారి గ్రామాల్లోనే నాణ్యమైన వైద్యం అందించే నిమిత్తం ప్రభుత్వం 104 వైద్యసేవలను ప్రారంభించిందని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ చెప్పారు. సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 14 రకాల వైద్య పరీక్షలు 107 రకాల మందులు ప్రజలకు అవసరాన్ని బట్టి అందిస్తారని ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి దివ్యశ్రీ, మహిళా ఆరోగ్య కార్యకర్త శైలజ, ఆశాలు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

బైరెడ్డిపల్లిలో..

ప్రజాశక్తి- కార్వేటినగరం : మండల పరిధిలోని కత్తెరపల్లి, పొన్నగల్లు గ్రామాల్లో బుధవారం పొల్లం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయధికారిణి హేమలత మాట్లాడుతూ రైతులు సాగుచేసే వరి, వేరుశనగ పంటలకు దిగుబడి ఆధారిత పంటల బీమా, టమోటా మామిడి పంటలకు వాతావరణ ఆధారిత పంట బీమా ఉందని తెలిపారు. పంట రుణాలు తీసుకోని రైతులు వరి పంటకు ఎకరాకు 84 రూపాయలు, వేరుశెనగకు 60 రూపాయలు ప్రీమియంను చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. పంట ఇన్సూరెన్స్ చేసుకున్న రైతులకు పంట నష్టం వస్తే వేరుశెనగ పంటకు ఎకరాకు 30వేల రూపాయలు వరి పంటకు ఎకరాకు 42 వేల రూపాయలు కవరేజ్ అవుతుందని పేర్కొన్నారు. ప్రీమియం చెల్లించి ఆఖరితేది వేరుశెనగకి డిసెంబర్ 15 లోపు, వరి పంటకు డిసెంబర్ 30 లోపు చెల్లించాలన్నారు. రైతులు పూర్తి వివరాలను రైతు సేవ కేంద్రంల అధికారులను, వ్యవసాయాధికారులను సంప్రదించాలని కోరారు.

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. వ్యవసాయ అనుబంధ శాఖల రైతులకు ప్రభుత్వ పథకాలు ప్రస్తుత పరిస్థితుల్లో పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మండల వ్యవసాయ అధికారి గీత, ఉద్యానవన శాఖ, పట్టు పరిశ్రమ శాఖ, వెటర్నరీ, సేంద్రియ వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: గంగాధర నెల్లూరు నియోజకవర్గం మారేపల్లి హరిజనవాడలో శ్రీనివాసులు (40) మూడు రోజుల క్రితం మృతి చెందాడు. మృతునికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న శ్రీలక్ష్మీ మొబైల్స్ పచ్చికాపల్లం అధినేత ప్రసాద్ స్పందించి మృతుని కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఏ ఆదరణ లేక కష్టాల్లో ఉన్న ఆ కుటుంబానికి అండగా నిలిచారని స్థానికులు అభినందించారు.

చోరీకి విఫలయత్నం..!

ప్రజాశక్తి- వెదురుకుప్పం : అమ్మవారి గుడిలో నగదు, ఆభరణాల చోరీకి దుండగులు ప్రయత్నం ఫలించలేదు. దీంతో దొంగతనానికి ఉపయోగించి టూల్స్‌ను అమ్మవారి గుడి ముందరే వదిలి వెళ్లారు. ఈ సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ, పేట గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారి గుడి లోపల బీరువాలో అమ్మవారి నగలు, హుండీలో సొమ్మును కాజేయడానికి గుర్తు తెలీని దుండగులు యత్నించారు. కానీ వారి ప్రయత్నం ఫలించకపోవడంతో అక్కడి నుంచి వెనుదిరిగారు. స్థానికులు గుడివద్ద చూడగా గుడి ముందర గేటు బీగాలు పగలగొట్టి ఉండటంతో పోలీసులు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించి దుండగులు తీసుకొచ్చిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలుపెట్టారు.

'బాల్య వివాహాలను అరికట్టాలి'

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: బాల్య వివాహం అరికట్టాలని డాక్టర్ రోహిత్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని పివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉమెన్స్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిత్ మాట్లాడుతూ వివాహ వయస్సు 18 సంవత్సరాలు నిండిన వారికి మాత్రమే చేయాలని, బాల్యవివాహాలు చేయడం వలన పిల్లలలో ఎదుగుదల తగ్గుతోందని, చిన్న వయస్సులో గర్భవతులై తల్లీబిడ్డ ప్రమాదాలకు గురవుతున్నారని వీటిని నిర్మూలించాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ గిరిబాబు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళి, డీపీఎంఓ మనీ, ఉమెన్స్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సిబ్బంది సబిత, ఉమా, మురళి, శరత్ కుమార్, రియల్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు రామారావు పాల్గొన్నారు.

దేవేంద్రప్పకు అభినందనలు

ప్రజాశక్తి - రొంపిచర్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ సంఘం ఛైర్మన్‌గా ఎన్నికైన దేవేంద్రప్ప అమరావతిలో బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కురుబ సంఘం డైరెక్టర్లు, రొంపిచర్ల మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ ఉయ్యాల రమణ, పలమనేరు నియోజకవర్గ కురుబ సంఘం డైరెక్టర్ సుబ్రహ్మణ్యం గౌడ్, పీలేరు నియోజకవర్గం కురుబ సంఘం డైరెక్టర్ వలిగట్ల వెంకటరమణ ఆయన్ను శాలువలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

నిరాశ్రయులకు స్వెటర్లు పంపిణీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మెప్మా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సపోర్ట్ సంస్థ నిర్వహిస్తున్న రెండవ నిరాశ్రయుల వసతి కేంద్రంలోని అభాగ్యులు ఒంటరి స్త్రీలకు, వృద్ధులకు, వికలాంగులకు, నిరాశ్రయులకు హెవెన్ అపార్ట్మెంట్‌లో నివాసముంటున్న కుటుంబీకులు స్వెటర్లు, సోపులు అందజేశారు. ఈ సందర్భంగా సపోర్ట్ సంస్థ అధ్యక్షులు వసతిగృహ నిర్వాహకులు జోసెఫ్ రాజ్ మాట్లాడుతూ హెవెన్ అపార్ట్మెంట్ వాసులు నిరాశ్రయులకు స్వెటర్లు ఇవ్వడం చాలా అభినందనీయమని అన్నారు. హెవెన్ అపార్ట్మెంట్స్ దాతలు రవిరెడ్డి, పునీత, కిషోరి, కల్పన, పద్మ, ప్రశాంతి వందన, కల్పన, వసతి గృహ సిబ్బంది ప్రమీల, ఇంద్రాణి, శేఖర్, రఘుపతి పాల్గొన్నారు.

నేడు వారపు సంత పునఃప్రారంభం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని వివిపురం గ్రామపంచాయతీ గంగమ్మ గుడిలో వారపు సంతను గురువారం ప్రారంభిస్తామని స్థానిక సర్పంచ్ లక్ష్మమ్మ బుధవారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. మండలంలోని రైతులు పండించిన పంటలను అమ్ముకునేందుకు, వ్యాపారస్తులు వ్యాపారం చేసుకొనుటకు అనుకూలమైన ప్రదేశంగా గంగమ్మ గుడి గ్రామంలో ప్రతి గురువారం సంత నిర్వహిస్తారని ఈ అవకాశాన్ని మండలంలోని గ్రామప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ రఘునాథ్ నాయుడు, పైనేని మురళి, దామోదర్ నాయుడు, కరణం జ్యోతి ప్రసాద్, వెంకటాచలపతి, బాలాజీ నాయుడు, రమేష్, ధన, వేలు నాటార్ పాల్గొన్నారు

1600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి- పుంగనూరు: నాటు సారా తయారీకి ఉపయోగించే బెల్లం ఊట 16 వందల లీటర్ల ధ్వంసం చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పుంగనూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పత్రపల్లి తండా, పెద్ద తండాలో విస్తృత దాడులను నిర్వహించారు. ఈ దాడులలో నాటు సారా తయారీకి పనికి వచ్చే 16 వందల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. ఈ దాడులలో ఎక్సైజ్ సీఐ కె సురేష్ రెడ్డి, ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ జవహర్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

VITH court BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL AT CHENNAI

MCOP NO 2589 OF 2024

Kuntrapakam Drakshayini ...**Petitioner**

VS

1. Nadella Ramesh ...Ist Respondent
2. Nation Insurance, Co, Ltd., ...**2nd Respondent**

TO

Nadella Ramesh, S/o N.Varadharajulu, No.3-219, Brahmin Street, Chittoor -517001. ... **1 st Respondent**

Take notice that the above case is posted to 20.01.2025 at 10.30am before the Hon'ble VIth Judge Of Motor Accident Claims Tribunal, Chennai for your appearance either in person or through pleader without fail or otherwise the matter will be decided in your absence.

Sd L.MOHAN RAO
ADVOCATE,
CHENNAI
Counsel for the Petitioner